నేడు ఉచితంగా మహిళలకు కేన్సర్ పరీక్షలు

ముషీరాబాద్: రోటరీ క్లబ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గంగపుత్ర ఫిష్‌మార్కెట్ భవనంలో మహిళలకు ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరాన్ని శుక్రవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4గంటల వరకు కొనసాగే ఈ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియ

ముషీరాబాద్: హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమారుడి పేరుతో ఏర్పాటు చేసిన వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాంనగర్‌లోని మీసేవా కేంద్రం వద్ద ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ హాజరై పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

కాచిగూడ: తెలంగాణ పద్మశాలి సంఘం ఉప ప్రధాన కార్యదర్శిగా వడిచర్ల మారుతి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వడిచర్ల మారుతిని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, సామల వెంకటేష్, వనమాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీనేజర్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ కళ్యాణిరెడ్డి

ముషీరాబాద్: టీనేజర్లు (18 ఏళ్లలోపు విద్యార్థులు) అప్రమత్తంగా ఉండాలని నోడల్ ఆఫీసర్ కళ్యాణిరెడ్డి అన్నారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో షీటీమ్స్, భరోసా సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లల భద్రత, లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి వాటి బారిన పడిన విద్యార్థులు ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, భరోసా, షీటీమ్స్ ప్రతినిధులు కనీజ్ ఫాతీమా, ఉపాధ్యాయుడు నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటాను ఎత్తేయండి:గుజ్జ సత్యం

కాచిగూడ: ఈడబ్ల్యూఎస్ కోటాతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను 10శాతం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాను ఎత్తేయాలని ఆయన డిమాండ్ చేశారు. జబల్‌పూర్ హైకోర్టు 2024లో తీర్పునిచ్చిందని అన్నారు. అయితే ఈ కేసులో మొత్తం ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్ల కింద పోగా మిగిలిన 50శాతం ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ కోటాకు 10శాతం కేటాయించాలని తీర్పునిచ్చినట్లు గుర్తు చేశారు. కానీ తెలంగాణలో మొత్తం ఉద్యోగాల్లో 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో మొత్తానికే మోసం వస్తుందని చెప్పారు. తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ కోటాను ఫిక్స్ చేయాలన్నారు.

శ్రీసాయిరాం విద్యాసంస్థల అధినేత నర్సింహగౌడ్ మృతి



కవాడిగూడ: శ్రీసాయిరాం హైస్కూల్ వ్యవస్థాపకులు కాపాల నర్సింహగౌడ్ (73) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయనకు పలువురు పార్టీల నేతలు హాజరై నివాళులర్పించారు. 1981సంవత్సరంలో శ్రీసాయిరాం విద్యాసంస్థలను స్థాపించారు. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఫీజు లేకుండానే చదువు చెప్పేవారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నర్సింహగౌడ్‌కు గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు.ఆయన మృతిచెందిన విషయం తెలుసుకుని బీజేపీ నాయకులు రంగరాజుగౌడ్, జి.వెంకటేష్, పీఎన్ చారి, ఎంసీ మహేందర్ బాబు, కాంగ్రెస్ నాయకులు బంటారం యాదగిరి గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది మోసపూరిత విధానాలు

- గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- పెంపకందారులకు రూ.2లక్షల నగదు బదిలీ చేయాలి
- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కిల్లె గోపాల్



అభివాదం చేస్తున్న గొర్రెల మేకల పెంపకందారుల సంఘం, వృత్తిదారుల సంఘాల నాయకులు

కవాడిగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.2లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి గొల్లకురుమలను కాంగ్రెస్ మోసం చేస్తోందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఆరోపించారు. ఎన్నికల్లో గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు.

◆ ఈ ధర్నాలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఉడుత రవీందర్, కిల్లె గోపాల్ మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్లకురుమల పట్ల అనుచరించిన మోసపూరిత విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో గొల్లకురుమలకు రూ.2లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న హామీని అమలు చేయకుండా గొల్లకురుమలను మోసం చేసిందని మండిపడ్డారు.

◆ పశువైద్యశాలల్లో ఎలాంటి మందులు ఉండటం లేదని.. రెండేళ్ల నుంచి మూగజీవాలకు కనీసం నట్టల మందులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల బెడద పెరిగిపోవడంతో పాటు రకరకాల ప్రమాదల కారణంగా వందలాది గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని వారు పేర్కొన్నారు.

◆ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గొర్రెలు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పశువైద్య శాలలో మందులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమణ, బ్యాండ్ కళాకారుల సంఘం నాయకులు జి.నాగరాజు, శౌర వృత్తిదారుల సంఘం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపించడం మాలలకు శాపంగా మారింది'

చిక్కడపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు మాలలకు శాపంగా మారిందని జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కరణం కిషన్ మండిపడ్డారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మాలల ఐక్యవేదిక నాయకులతో కలసి ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరణం కిషన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రావడానికి మాలలు ఎంతో కృషి చేశామన్నారు. కానీ ఇప్పుడు తమకే అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మాదిగలకు వత్తాసు పలకడం దారుణమన్నారు. రాబోయే పది రోజుల్లో వర్గీకరణ చేస్తామని సీఎం చెప్పడం సరికాదన్నారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కరణం కిషన్‌లు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అరెస్టు చేసిన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో కిషన్‌తో పాటు వేదిక నాయకులు గడ్డిమల వినోద్, అవుల సుధీర్, పంబాల రాజు, గడ్డం వినయ్, సల్ల పవన్, కారణం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బధిరులకు ప్రత్యేక కళాశాలలు ఏర్పాటు చేయాలి



ఉమెన్స్ చిల్డ్రన్ డిజేబుల్డ్ శాఖ కార్యదర్శికి వినతి పత్రం సమర్పిస్తున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బధిరులకు ప్రత్యేక స్కూల్‌తో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేశ్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాలేజీ కోసం ప్రైవేటు విద్యాసంస్థల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చి నిరుపేదలు చదువుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. మలక్‌పేట వికలాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో కళాశాలతో పాటు హాస్టల్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉమెన్స్ చిల్డ్రన్ డిజేబుల్డ్ సెక్రటరీ అనితా రామచంద్రన్‌కు, రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్లకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ



అల్వాల్‌లో పరిశీలిస్తున్న జిల్లా భూసేకరణ అధికారి శంకర్‌కుమార్

అల్వాల్: ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ కోసం భూ సేకరణ జరుగుతుందని మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా భూసేకరణ అధికారి కె.శంకర్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అల్వాల్, లోతుకుంట, హకీంపేట ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. ఇంటి నిర్మాణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ వివరాలు జిరాక్స్ పత్రాలు సమర్పించాలని కోరారు.

శబరీశుడికి మహాపూజ



బర్కత్‌పురలో జరిగిన అయ్యప్పస్వామి మహా పడిపూజలో భక్తులు

కాచిగూడ: స్వామియే అయ్యప్పో.. అయ్యప్పో స్వామియే.. అంటూ ఆ ప్రాంతమంతా మార్మోగింది. నారాయణగూడకు చెందిన ఆకుల మహేష్ కుమార్, ఆకుల వీరేష్, ఆకుల మల్లికార్జున్ స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రమణ్య, అయ్యప్పస్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. పూజలో సాత్విక్ శర్మ స్వామి, శ్రీరామస్వామి పాల్గొన్నారు.

అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేయాలి



సుందరయ్యపార్కు వద్ద కేంద్ర హోంమత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కేవీపీఎస్ నేతలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అవమానకరమైన వాఖ్యలపై ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబులు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య పార్కు వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంబేడ్కర్‌పై అహంకార పూరితమైన తిరస్కార స్వరంతో మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. భారత దేశ లౌకిక, ప్రగతిశీల, రాజ్యాంగ రూపశిల్పిని అగౌరవ పర్చుతూ అపహాస్యం చేయడాన్ని విమర్శించారు. వెంటనే అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇది కేవలం అంబేడ్కర్‌దే అవమానం కాదని యావత్ ప్రజలను అందరిని అవమానించిన ట్లే అన్నారు. రాజ్యాంగంపట్ల నిజమైన గౌరవం లేదని మరోసారి రుజువు చేశారని ఆరోపించారు. కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం. దశరథ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, బి. సుబ్బారావు, కె. రమేష్, జి. రాములు, కృష్ణప్రసాద్, జగదీష్, శ్రీరాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర పోలింగ్ బూత్ బీజేపీ అధ్యక్షుడిగా శ్రీధర్ లోకండే



శ్రీధర్ లోకండేకు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బర్కత్‌పుర పోలింగ్ బూత్ నం.217 అధ్యక్షుడిగా శ్రీధర్ లోకండేను నియమిస్తూ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు గురువారం రాత్రి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి, నేతలు రమేష్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, అరవింద్, సత్యేందర్, రామన్, దొరస్వాతి, అనీషా, కృష్ణకుమార్, శీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



కేంద్రమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అంబర్‌పేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అవమానకరంగా మాట్లాడారని కేవీపీఎస్ నగర కమిటీ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు అన్నారు. గురువారం అంబర్‌పేట తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నగర నాయకులు మహేందర్‌తో కలిసి ఆయన హాజరై అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.రాములు, అర్జున్, జనార్దన్, మహాదేవ్, కిషన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి నుంచి కృషి చేయాలి

చిక్కడపల్లి: బీజేపీ బలోపేతానికి నేతలు, కార్యకర్తల బూత్‌స్థాయి నుంచి కృషి చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం డివిజన్‌లో బీజేపీ బూత్ కమిటీల నూతన అధ్యక్షులుగా నియమితులైన డి.కుమార్, నీరజ్, శ్రీనివాస్, ఆనంద్‌లను ఆయన ముఖ్యఅతిథిగా సన్మానించి మాట్లాడారు. అమలుకాని ఆరు గ్యారంటీలతో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రత్నసాయి చంద్, నేతలు ఓ.శ్రీకాంత్, దామోదర్, మెతుకు ఉమేష్, ఆకుల సురేందర్, దోనేటి సత్యం, ఉల్లాస్, వనజ తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీల నూతన అధ్యక్షులును సన్మానిస్తున్న బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్

రేణికుంట్ల ఎల్లయ్యకు సేవా భూషణ్ పురస్కారం



రేణికుంట్ల ఎల్లయ్యకు పురస్కారం అందజేసి సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవా భూషణ్ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ జి. చంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని దళితరత్న రేణికుంట్ల ఎల్లయ్యకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ... దేశ విదేశాలలో దళిత కల్యాణ వేదిక ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా 5616 వివాహాలు చేసినందుకు ఈ పురస్కారం లభించిందన్నారు. అంతేకాకుండా దళితులకు వివాహం చేసుకున్న వారికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారిచే రూ.2.5లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ది బెస్ట్ అకాడమీ చైర్మన్ సూర్యనారాయణ, కార్యదర్శి సుబ్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డి పోటీ



ఉపాధ్యాయ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మణిపాల్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ వ్యవస్థపక అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి పోటీ చేస్తున్నారని ఆయన గెలుపుకై 36 ఉపాధ్యాయ సంఘాల టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కృషి చేస్తోందని జేఏసీ చైర్మన్ మణిపాల్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ పర్వత సత్యనారాయణ తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి హర్షవర్ధన్‌రెడ్డి అని అన్నారు. ఉపాధ్యాయులందరూ హర్షవర్ధన్‌రెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు. జేఏసీ అధ్యక్షులు రాగపాటి ఉమాకర్‌రెడ్డి, బాదె లింగస్వామి, జేఏసీ కో-చైర్మన్ గోవింద్‌నాయక్, లచ్చిరాం, నర్సింహులు, టి.సత్యనారాయణ, రఘునందన్‌రెడ్డి, మోతీలాల్‌నాయక్, చాగంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



సత్యగ్రహ దీక్ష చేస్తున్న టీపీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

కాచిగూడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి తొలపునూరి కృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. అంబేడ్క పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు గురువారం ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కాచిగూడ, గోల్నాక డివిజన్ల నుంచి పార్టీ నేతలు సత్యాగ్రహ దీక్షకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న నేతలను పోలీసులు అరెస్ట్ చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నేతలు రామ్మోహన్, లక్ష్మణ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్

కాచిగూడ: సిండికెట్ బ్యాంక్ తెలంగాణ మల్టీపర్పస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కాచిగూడలో జరిగిన సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఇక్బాల్, కార్యదర్శిగా పరమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా వెంకట్, కోశాధికారిగా వినోద్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతరావు, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వెంకటరమణ, వసంతసేన రాజు, శ్రీనివాస్ నాయక్, అబ్దుల్ హాయ్, వెంకటేశ్వర్‌రావు, ఆనంద్ కుమార్, నవీన్ కుమార్, రాజ్‌కుమార్, మహేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వీ చెన్నారావుకు సేవాభారతి పురస్కారం ప్రదానం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జాతీయ సంగీత వాయిద్య కళాకారుల జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు వివిధ రంగాలలో అనేక సేవలు అందిస్తున్నారని డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శ్రీ భారతి ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజికల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సేవా భారతి పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాస్‌రావు, ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ మాధవ పెద్ది మూర్తి, సినీ సంగీత దర్శకులు మాతవపెద్ది సురేష్, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రాంతాలకు అతీతంగా గౌడల అభివృద్ధికి కృషి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రాంతాలకు అతీతంగా గౌడల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌గౌడ్ తెలిపినట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన అనంతరం చిక్కడపల్లిలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు గౌడ కులస్తులు కల్లుగీత వృత్తితో పాటు మద్యం అమ్మకాలు చేసుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం తాము కృషి చేస్తున్నామని అన్నారు. గౌడల అభివృద్ధికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్రంలో వైన్‌షాపుల్లో గౌడ్‌లకు రిజర్వేషన్లు కల్పిస్తుందని అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా గౌడ్‌లకు రిజర్వేషన్ కల్పించాలని వారు కోరారు. ప్రాంతాలుగా వేరుగా ఉన్నా తమ జాతి కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం



చిక్కడపల్లి: మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదపడతాయని ప్రముఖ సినీనటుడు రాంకీ అన్నారు. రిషి మ్యూజికల్ ఈవెంట్స్ తృతీయ వార్షికోత్సవాలు గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాంకీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ అధ్యక్షురాలు యోగిత అక్కిరాజుఅనేక మంది గాయకులను తమ సంస్థ ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు రామకృష్ణ, కొమ్మరాజు ప్రసాద్‌ను సన్మానించారు. 2025 సంవత్సరంలో రిషి మ్యూజికల్ ఈవెంట్ కేలండర్‌ను ఆవిష్కరించారు.